క్లుప్తంగా

తాళ్లవలస పీహెచ్‌సీలో రేపు వైద్య శిబిరం

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆరోగ్య విస్తరణాధికారి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వైద్యులతో పాటు నిపుణులైన వైద్యులు ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందిస్తారని పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ వైద్యురాలికి పదోన్నతిపై బదిలీ


డాక్టర్ స్వప్న

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రధాన వైద్యురాలు కె.స్వప్నకు పదోన్నతిపై బదిలీ అయింది. ఈమె అనకాపల్లి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోలర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

భీమునిపట్నం: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు గడువును ఈ నెల 30 వరకు పెంచినట్లు భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ మంగళవారం తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గంధవరంలో పౌష్టికాహార ప్రదర్శన


గంధవరంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన

పద్మనాభం: రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా మండలంలోని గంధవరంలో మంగళవారం పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆకు కూరలు, బొప్పాయి, పలు రకాల పండ్లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్


ప్రతిభను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తగరపువలస: స్థానిక శ్రీబాసర విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీబాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ మంగళవారం ముగిసింది. ప్రీ ప్రైమరీ నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. సైన్స్, గణితం, సోషల్ సబ్జెక్టు, వివిధ భాషలలో తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరిస్తూ తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ వూడి రమేష్, ప్రిన్సిపాల్ రేఖ, డీన్ భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు కేశవ తదితరులు విద్యార్థులను అభినందించారు.

బీమా పథకాలతో కుటుంబాలకు భరోసా


మాట్లాడుతున్న ఆర్‌బీఐ జీఎం మహానా

పద్మనాభం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్‌కే మహానా అన్నారు. మండలంలోని పెంటగ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష , జీవన జ్యోతి, అటల్ పెన్షన్ బీమా వంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ఖాతాదారులు ఈ పథకాల్లో చేరి తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని కోరారు. అనంతవరం ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం రాధాకృష్ణ మూర్తి, జిల్లా లీడ్ మేనేజర్ శ్రీనివాస్, సీఎంఎఫ్ఐ వేణుగోపాల్, ఎఫ్ఐ మేనేజర్ రాఘవేంద్ర, అనంతవరం బ్రాంచ్ మేనేజర్ బెన్ యోనా, సర్పంచ్ బోదల పావని పాల్గొన్నారు.


మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో గాయత్రీదేవిగా అమ్మవారు


కటకం బాబులు మండపం వద్ద శ్రీవాసవీ క్లబ్ మహిళల కోలాట ప్రదర్శన


దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు


ఆదర్శనగర్ శుభం అపార్ట్‌మెంట్ వద్ద..


అంబేద్కర్ కూడలిలోని దుర్గాంబికా ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో..


కార్మికవాడ నీళ్ల ట్యాంక్ వద్ద మండపంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

వేద మాత.. వరప్రదాత

రెండోరోజు గాయత్రీ మాతగా దుర్గాదేవి దర్శనం ■ వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ వేదమాత గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. తగరపువలస బైపాస్‌రోడ్డులోని విజయదుర్గాదేవి ఆలయం, సంగివలస పోలమాంబ ఆలయంతో పాటు వాడవాడలా కొలువుదీర్చిన మండపాల్లో విశేష పూజలు చేశారు. సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం, కొమ్మాది అష్టలక్ష్మీ ఆలయం, చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారికి చక్కెరపొంగలి, ఇతర ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంచారు. ఆలయాల్లో, మండపాల వద్ద ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అర్చించారు.

– తగరపువలస/మధురవాడ/కొమ్మాది/పద్మనాభం


గాయత్రీ మాతగా భక్తులకు దర్శనం ఇచ్చిన దుర్గామాత


ఎండాడ దుర్గాదేవి ఆలయంలో గాయత్రి దేవిగా..


పద్మనాభంలో గాయత్రీ మాతగా దుర్గాదేవి


టైలర్స్ కాలనీ విజయదుర్గా దేవి ఆలయం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న దుకాణాల తొలగింపు


మధురవాడలో బడ్డీల తరలిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) జెడ్సీ వద్ద గోడు వెలిబుచ్చుతున్న బాధితులు

మధురవాడ: ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా దుకాణాల తొలగింపు కొనసాగుతోంది. జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ పీహెచ్‌సీ రోడ్డులో ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు మంగళవారం తొలగించారు. కరెంటు మీటర్లు, సామగ్రి అయినా తీసుకునే అవకాశం ఇవ్వకుండా టీపీవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో తొలగింపు చేపట్టారు. పనులను జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి పర్యవేక్షించారు. ప్రత్యామ్నాయ స్థలాలు, హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి దుకాణాలు, తోపుడు బండ్లు తొలగించాలని బాధితులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరుతున్నారు. జీవీఎంసీకి వచ్చిన గిఫ్ట్ డీడ్ స్థలాల్లో వెలసిన.. రోడ్డును, ప్రధాన జంక్షన్లను ఆనుకుని ఆక్రమణల జోలికి వెళ్లడానికి మాత్రం అధికారులు సాహసించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు


పీఎం పాలెం యూపీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ రమేష్

మధురవాడ: స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా పీఎం పాలెం యూపీహెచ్‌సీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా క్షయ మరియు ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ రమేష్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ సందర్శించారు. ఇక్కడ నమోదు అవుతున్న టీబీ, ఎయిడ్స్ కేసులు, నిర్వహిస్తున్న పరీక్షలు, ఇతర వివరాలను వైద్యులనడికి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజాన్, టీబీ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం పెద్దిపాలెంలో..

తగరపువలస: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య సహాయాధికారి డాక్టర్ ఆర్.రమేష్ కోరారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో మంగళవారం జరిగిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు వై.దుర్గాకల్యాణి, డి.రవీంద్రనాయక్, హెల్త్ అసిస్టెంట్ అనూష, బీజేపీ నాయకుడు ఉప్పాడ అప్పారావు, ముదిలి చిన్నయ్యపాత్రుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతులున్నా వైద్యుల్లేక..

- రేవిడి పీహెచ్‌సీలో ఏడేళ్లుగా నిలిచిపోయిన ట్యూబెక్టమీ ఆపరేషన్లు
- నిరుపయోగంగా ఆపరేషన్ థియేటర్, సర్జికల్ మెటీరియల్
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న మహిళలు


నిరుపయోగంగా ఉన్న ఆపరేషన్ థియేటర్


రేవిడి పీహెచ్‌సీ

పద్మనాభం: వసతులున్న చోట వైద్యులుండరు.. వైద్యులున్న చోట వసతులుండవు అన్నట్లుగా ఉంది ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితి. ఇందుకు పద్మనాభం మండలం రేవిడి పీహెచ్‌సీనే నిదర్శనం. ఆస్పత్రిలో మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (ట్యూబెక్టమీ) చేయడానికి అవసరమైన సౌకర్యాలన్నీ ఉన్నా శిక్షణ పొందిన వైద్యులేరు. దీంతో సమీపంలోనే ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా మహిళలు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రేవిడి పీహెచ్‌సీలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిలిచిపోయాయి. గతంలో ఈ ఆస్పత్రిలోనే కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు జరిగేవి. 2018 నుంచి ఈ ఆపరేషన్లు నిలిపివేశారు. ఇక్కడ ఆపరేషన్లు చెయ్యడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఆపరేషన్ థియటర్, టేబుళ్లు, కత్తెర్లు, గ్రీన్ క్లాత్ తదితర సర్జికల్ మెటీరియల్ అంతా సిద్ధంగానే ఉంది. కానీ ఆపరేషన్ చేసేందుకు ట్యూబెక్టమీలో శిక్షణ పొందిన వైద్యులు లేరు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులున్నా.. వారికి ట్యూబెక్టమీ ఆపరేషన్లు చెయ్యడానికి ప్రభుత్వం శిక్షణ ఇవ్వలేదు. దీంతో ఎక్కువ మంది మహిళలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఒకరో, ఇద్దరో రేవిడి పీహెచ్‌సీకి వెళితే, వీరిని ట్యూబెక్టమీ ఆపరేషన్ల శిబిరాలు పెట్టేటప్పుడు వేరే చోటుకు పంపిస్తున్నారు. శిబిరాలు పెట్టేంతవరకు వీరు వేచి ఉండాల్సిన పరిస్థితి. పీహెచ్‌సీలోనే అన్ని వసతులు ఉన్నందున ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ట్యూబెక్టమీ ఆపరేషన్లు ఇక్కడే పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శిబిరాలకు పంపిస్తున్నాం

ట్యూబెక్టమీ ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు అక్కడికి పంపించి ఆపరేషన్లు చేయిస్తున్నాం. రేవిడి ఆస్పత్రిలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయడంలేదు. ప్రభుత్వం కూడా జనాభా పెంపుదలను ప్రోత్సహిస్తోంది.

– లీలా ప్రసాద్, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి


నిరుపయోగంగా సర్జికల్ మెటీరియల్


వృథాగా ఉన్న టేబుళ్లు

అందుబాటులోకి బోరుబావి

సాక్షి ఎఫెక్ట్..


కార్మికవాడలో బోరుబావిని సిద్ధం చేస్తున్న సిబ్బంది

తగరపువలస: చిట్టివలస బంతాటమైదానం ఎదురుగా కార్మికవాడలో బోరుబావిని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ సిబ్బంది వాడకానికి సిద్ధం చేశారు. బోరుబావి చుట్టూ తుప్పలు పెరిగి వినియోగానికి అనువుగా లేకపోవడంతో పాటు నీరు సరిగా రాని కారణంగా ' ఈ బోరును వినియోగించుకునేదెలా?' శీర్షికతో మంగళవారం సాక్షిలో వార్తను ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సిబ్బంది బోరుబావి వద్ద శుభ్రం చేసి, నీరు ధారాళంగా వచ్చేందుకు అనువుగా మరమ్మతులు పూర్తి చేశారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన


తెగుళ్ల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ విజయప్రసాద్

తగరపువలస: తెగుళ్ల నివారణపై కాపులుప్పాడలో రైతులకు వ్యవసాయ శాఖాధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. భీమిలి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో పర్యటించిన వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి వరి పొలాల్లో ఆకు ముడత తెగులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వరి పంట పిలకదశలో ఉన్నందున తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. 10 నుంచి 15 ఎకరాలలో ఒకేసారి పురుగుల మందు పిచికారి చేయవలసి వచ్చినప్పుడు డ్రోన్ ఉపయోగించి సమయంతో పాటు పురుగుల మందుకు అయ్యే ఖర్చును ఆదా చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎరుసు అప్పలకొండ రెడ్డి, శీరపు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

మధురవాడ: నియోజకవర్గ పరిధిలో ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసులు నమోదయ్యాయి. వివరాలివి.. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధి మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన వివాహిత పల్లకిల మాధురి(32) ఈ నెల 19వ తేదీన రాత్రి భర్త అశోక్ కుమార్‌తో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త అశోక్‌కుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు తమను 94407 96060, 77949 46343 నంబర్లలో సంప్రదించాలని సీఐ బాలకృష్ణ కోరారు.

భీమిలి పరిధిలో..

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామానికి చెందిన వివాహిత కొయ్య గౌరి(29) ఈ నెల 21న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పల గోవింద్‌తో ఈమెకు వివాహమైంది. అప్పుడప్పుడు వీరి మధ్య మనస్పర్థలు కలిగి, ఆమె పుట్టింటికి వెళ్లిపోవడం.. పెద్దల సాయంతో తిరిగి తీసుకురావడం జరుగుతుండేది. ఇటీవల ఆమె అదృశ్యం అయిన తరువాత అప్పల గోవింద్ బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జయలక్ష్మికి శంకరశాస్త్రి పురస్కారం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ నెల వారీ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కళాభారతి ఆడటోరియంలో నిర్వహించిన కళాప్రపూర్ణ ఈమని శంకరశాస్త్రి జ్ఞాపక పురస్కారం చెన్నైకు చెందిన ప్రముఖ డాక్టర్ ఆర్.ఎస్.జయలక్ష్మికి అకాడమీ అధ్యక్షుడు రామమూర్తి, ఉపాధ్యక్షుడు పేరాల బాలమురళి, రాజారావు, కార్యదర్శి చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, భుజంగరావు, జ్వాలాప్రసాద్ అందజేశారు. అనంతరం జయలక్ష్మి వీణ వాదన కచేరీ, తన మనవరాలు చారులతతో కలిసి శ్రావ్యంగా కీర్తనలను ఆలపించారు. చంద్రశేఖర్ వీణ, డాక్టర్ మండపాక రవి మృదంగం, విద్వాన్ రామకృష్ణ ఘట సహకారం అందించారు.

కార్మికుల బకాయిల వివరాలు ఇవ్వండి

జ్యూట్‌మిల్లు యాజమాన్య ప్రతినిధికి జేసీఎల్ ఆదేశం


జేసీఎల్ రామారావుతో సమావేశమైన ఇంటక్, మిల్లు యాజమాన్య ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం నుంచి రావలసిన బకాయిల వివరాలు వెంటనే ఇవ్వాలని జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు, మిల్లు యాజమాన్య ప్రతినిధి లలిత్ మోహన్‌కు ఆదేశించారు. అప్పుడే కార్మిక సంఘాలు మిల్లు ఆస్తులపై వేసిన అటాచ్‌మెంట్ కేసును తీయాలో వద్దో చర్చిద్దామన్నారు. మిల్లు గుర్తింపు సంఘం ఇంటక్ ప్రతినిధులు, లలిత్ మోహన్‌తో మంగళవారం ఆయన తన కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లలిత్‌మోహన్ జేసీఎల్‌కు బదులు ఇస్తూ వారం రోజులలో కార్మికులకు ఇవ్వవలసిన బకాయిల వివరాలు సమర్పిస్తామన్నారు. ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు మాట్లాడుతూ బకాయిలు, అటాచ్‌మెంట్ వివరాలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో మాట్లాడదామన్నారు. సమావేశంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ఆఫీస్ బేరర్లు కొయ్య సూరి గురువులు, పూసర్ల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.